


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక





ఆదివారం 15-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 276 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## యుద్ధం 'నిర్ణయాత్మక' దశకు..

### ఖార్గ్ దీవిపై అమెరికా-ఇజ్రాయెల్ భీకర దాడులు!

- ఇరాన్ చమురు కేంద్రంపై 90 సైనిక లక్ష్యాల ధ్వంసం: డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హోర్ముజ్ జలసంధిని దాటిన భారత చమురు నౌకలు.. ఊపిరి పీల్చుకున్న న్యూఢిల్లీ
- దుబాయ్, దోహాల్లో పేలుళ్లు.. గల్ఫ్ దేశాలకు విస్తరిస్తున్న మంటలు


2 లో

( ఇది కద నిజం: టెల్ అవీవ్/వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న యుద్ధం శనివారం నాడు అత్యంత భీకరమైన మరియు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. యుద్ధం మొదలైన 15వ రోజున అమెరికా మరియు ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్ యొక్క అతిపెద్ద చమురు ఎగుమతి కేంద్రమైన 'ఖార్గ్ దీవి' లక్ష్యంగా భారీ వైమానిక దాడులు జరిపాయి. ఈ దాడులతో యుద్ధం క్లైమాక్స్‌కు చేరుకుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.

ఖార్గ్ దీవిపై క్షిపణుల వర్షం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ఉదయం ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి ఖార్గ్ దీవిలో ఉన్న 90 సైనిక స్థావరాలను తమ దళాలు "తుడిచిపెట్టాయని" (Obliterated) పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా పడిపోతున్న కోడిగుడ్డు ధర..


2 లో

పశ్చిమాసియాలో యుద్ధం పరోక్ష ప్రభావం దేశంలోని వివిధ రంగాలపై కనిపిస్తోంది. గ్యాస్ ధరల నుండి ఆటో ఛార్జీల వరకు ప్రతిదీ జేబులపై భారం పడుతోంది.అయితే, గుడ్డు ధరల విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గుడ్డు ధరలు సగానికి తగ్గాయి. పెద్ద వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నారు. గత కొన్ని రోజులుగా గుడ్డు ధరలు సగానికి తగ్గుతున్నాయి. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో ఖచ్చితంగా తెలియదు. ఫలితంగా గుడ్డు మార్కెట్లో అనిశ్చితి పెరుగుతోంది.

## కొండగట్టుకు 'బండి' మహా పాదయాత్ర

- కాషాయమయమైన కరీంనగర్!


2 లో

కరీంనగర్/ జగిత్యాల: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం కరీంనగర్ నుండి జగిత్యాల జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరుతో చేపట్టిన ఈ 40 కిలోమీటర్ల మహా పాదయాత్ర ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.

## గిరిజనుల మధ్య జనసేన ఆవిర్భావ దినోత్సవం

పాడేరు (ఇది కద నిజం): జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈసారి గ్రామ స్థాయిలో నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చిన పవన్ కళ్యాణ్ .... తానూ ఓ మారుమూల గిరిజన గ్రామంలో అడవిబిడ్డల మధ్య జరుపుకొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలోని ఓనూరు కూడలి వద్ద నిర్మించిన నూతన జెండా స్థూపాన్ని ఆవిష్కరించి పార్టీ శ్రేణులకి శుభాకాంక్షలు తెలిపారు.


2 లో

## ఉద్యోగులకు ఏపీ సర్కార్ వరాలు



2 లో

అమరావతి (ఇది కద నిజం): ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, జనాభా నియంత్రణ విధానాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో తగ్గుతున్న జనాభా వృద్ధి రేటును పెంచే లక్ష్యంతో మూడో సంతానం పొందిన పురుష ఉద్యోగులకు ప్రయోగాత్మకంగా రెండు నెలల పాటు పితృత్వ సెలవులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఈ వివరాలు వెల్లడించారు. పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.



## మూసీ పేరుతో దోపిడీ చేస్తే అడ్డుకుంటాం

- మూసీ ప్రాజెక్ట్‌పై కేటీఆర్ ఫైర్
- లక్షన్నర కోట్ల మూసీ ప్రాజెక్ట్‌పై కేటీఆర్ ప్రశ్నలు
- ప్రజల ఇళ్లు కూల్చితే బీఆర్ఎస్ పోరాటం తప్పదు
- మూసీ ప్రాజెక్ట్‌లో భారీ అవినీతి జరుగుతుందంటూ కేటీఆర్ ఆరోపణలు

మూసీ నది సుందరీకరణ పేరుతో ప్రజల సొమ్ము దోచుకోవాలని ప్రయత్నిస్తే తప్పనిసరిగా అడ్డుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. మూసీ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ అవినీతి, ప్రజల ఇళ్ల కూల్చివేతను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం గండిపేట మండల పరిధిలోని హిమాయత్ సాగర్ వద్ద నిర్వహించిన "మూసీ పునరుజ్జీవం -- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్" కార్యక్రమంలో కేటీఆర్ సుదీర్ఘంగా మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 16 వేల కోట్ల రూపాయలతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో సుమారు 6 కిలోమీటర్ల మేర విజయవంతంగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో వేల ఇళ్లను కూల్చివేసి మూసీ ప్రణాళిక అమలు చేయాలని చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

మిగతా 2లో ..

## బీసీలకు 'రక్షణ'తో భరోసా

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి...
- వెనుకబడిన వర్గాల ధన, మాన, ప్రాణ రక్షణకు ప్రాధాన్యం
- బీసీల గౌరవప్రద జీవనం కూటమి సంకల్పం : మంత్రి సవిత
- బీసీల రక్షణమే కూటమి లక్ష్యం : మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర
- విజయవాడలో బీసీ రక్షణంపై బీసీల మంత్రుల భేటీ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన మంత్రులు వాసం శెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్య కుమార్ యాదవ్



2 లో

విజయవాడ ,మార్చి 14(ఇది కద నిజం) : 138 వెనుబడిన తరగతుల కులాల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించేలా బీసీ రక్షణ చట్టం త్వరలోనేఅమల్లోకి తీసుకురానున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. బీసీలను కులం పేరుతో గాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక బహిష్కరణలకు పాల్పడినా గాని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత నేతృత్వంలో శనివారం నిర్వహించిన బీసీ రక్షణ చట్టం భేటీలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

## ఏపీకి రూ.341 కోట్ల కేంద్రసాయం

జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి(ఎన్డీఆర్ఎఫ్) నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.341.48 కోట్ల సాయం ప్రకటించింది. గతేడాది సంభవించిన వరదలు, ఆకస్మిక వర్షాలు, మొంథా తుపాను, కొండచరియలు విరిగిపడటం కారణంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లకు కలిపి మొత్తం రూ.1,912.99 కోట్ల సాయం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్షా అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయించింది. అందులో ఆంధ్రప్రదేశ్ కు రూ.341.48 కోట్లు (17.85%) కేటాయించింది.


2 లో

## గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందవద్దు

- రియల్ టైం గవర్నెన్స్ ద్వారా పరిస్థితిని సమీకరిస్తున్నాము. - మంత్రుల బృందం.
- కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు
- మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ
- కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు
- సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి
- వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు



2 లో

అమరావతి ,మార్చి 14(ఇది కద నిజం): రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం (జీవోఎం) నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.

# బీసీలకు 'రక్షణ'తో భరోసా

మొదటి పేజీ తరువాయి మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన అన్నీ హామీలను నెరవేరుస్తున్నామని, ఈ నేపథ్యంలో త్వరలోనే బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నామని తెలిపారు. చట్టం రూప కల్పనకు తుది రూపు ఇవ్వడానికే బీసీ మంత్రులతో కీలక భేటీ నిర్వహించామన్నారు. ఇది వరకే రెండు పర్యాయాలు బీసీ మంత్రులు సమావేశమయ్యామన్నారు. ఇప్పటికే బీసీ చట్టం ముసాయిదా కూడా సిద్ధం చేశామన్నారు. 138 కులాలకు చెందిన బీసీలను కులం పేరుతోగాని, వృత్తి పేరుతో గాని దూషించినా, సాంఘిక, ఆర్థిక బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బీసీల ధన, మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందిస్తున్నామన్నారు. 15 రకాల వేధింపులకు శిక్షలు రూపొందిస్తున్నామన్నారు. బీసీ మంత్రుల భేటీ వివరాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. దేశంనే తొలిసారిగా ఏపీలో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామన్నారు. బీసీ రక్షణ చట్టం డ్రాఫ్ట్ పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 జోన్లో ఉన్న బీసీ సంఘాలు, ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. , త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమలు చేయనున్నామని స్పష్టం చేశారు. బీసీలకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలపాలన్నదే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు సంకల్పమని మంత్రి సవిత తెలిపారు.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందవద్దు

మొదటి పేజీ తరువాయి శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రిఫైనరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:

విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరుగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్ తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# గిరిజనుల మధ్య జనసేన ఆవిర్భావ దినోత్సవం

పాడేరు (ఇది కద నిజం) జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈసారి గ్రామ స్థాయిలో నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చిన పవన్ కళ్యాణ్ .... తానూ ఓ మారుమూల గిరిజన గ్రామంలో అడవిబిడ్డల మధ్య జరుపుకొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలోని ఓనూరు కూడలి వద్ద నిర్మించిన నూతన జెండా స్థూపాన్ని ఆవిష్కరించి పార్టీ శ్రేణులకి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం పీఎం జన్ మన్ పథకం ద్వారా ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు 2.4 కిలోమీటర్ల పొడుగున నిర్మించిన నూతన రహదారిని కాలినడకన పరిశీలించారు. కొండలను తొలచి, మార్గమధ్యంలో ఉన్న బండలను తొలగించి, ఎంతో కష్టపడి నాణ్యత వ్యవహారంలో రాజీపడకుండా నిబద్ధతతో రోడ్డును పూర్తి చేసిన అధికారులను అభినందించారు. 2.4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం మధ్యలో 8 కల్వర్టులు నిర్మించాల్సి వచ్చిందని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు. కాలినడకన వెళ్తూ.. కల్వర్టులు, రోడ్లకు ఇరువైపులా గిరిజనుల సాగులో ఉన్న పొలాలను పరిశీలించారు. చిన్నారులతో కలసి థ్యాంక్యూ మోదీజీ అంటూ రోడ్డు నిర్మాణానికి పీఎం జన్ మన్ నిధులు కేటాయించినందుకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పోడు వ్యవసాయ కమతాల్లో చేపట్టిన భూ అభివృద్ధి పనుల వివరాలు అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. కొండవాలు పోడు భూముల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన రాళ్ల గోడలను పరికించారు.

తమ గ్రామాలకు కొత్త రోడ్డు వేయడంతో పాటు జల్ జీవన్ మిషన్ పథకం కింద శుద్ధమైన తాగునీరు అందించే ఏర్పాటు చేసిన ఉపముఖ్యమంత్రివర్యులకు గిరిజనులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఓనూరు జంక్షన్ వద్ద సంప్రదాయ థింసా నృత్యంతో ఆహ్వానం పలికారు. తమ గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఓనూరు గ్రామం వద్ద ఆడపడుచులు తాము పండించిన గులాబీలు పవన్ కళ్యాణ్ కి అందజేస్తూ స్వాగతం పలికారు.

అంతకు ముందు పాడేరు సమీపంలోని వర్ధనపల్లి గ్రామంలో పవన్ కళ్యాణ్ పరిశీలించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. డ్రైనేజీలు నిర్వహణ లేక పూడిపోయి ఉండడాన్ని గమనించారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్తుల కోరిక మేరకు రచ్చబండ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. శిధిలావస్థకు చేరిన శివాలయాన్ని పరిశీలించారు.

పాడేరు పర్యటనకు వచ్చిన పవన్ కళ్యాణ్ కి దారిపొడుగునా గిరిపుత్రులు ఘనస్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పసుపు కలిపిన అక్షతలతో నుదిటిన బొట్లు పెట్టి ఆహ్వానం పలికారు. గిరిజన ప్రాంతాల్లో పూసే పూలు, కాఫీ గింజలతో తయారు చేసిన పుష్పగుచ్చాలను అందజేశారు. దారిపొడుగునా తమ సమస్యలు తెలియజేస్తూ అర్జీలు సమర్పించారు. తిరుగు ప్రయాణంలో పాడేరు శివారులోని శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు.

# కొండగట్టుకు 'బండి' మహా పాదయాత్ర

మొదటి పేజీ తరువాయి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘనవిజయానికి కృతజ్ఞతగా, మొక్కు తీర్చుకునేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

**మహాశక్తి ఆలయం వద్ద అంకురార్పణ**

శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్ద బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలాది మంది కార్యకర్తలు, హనుమాన్ భక్తులు "జై శ్రీరామ్", "జై అంజన్న" నినాదాలతో హోరెత్తించారు. కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు సహా కొత్తగా ఎన్నికైన వందలాది మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు ఈ యాత్రలో అడుగులో అడుగేశారు.

**తేనెటీగల దాడి.. బెదరని మంత్రి**

పాదయాత్ర రామడుగు మండలం కొనరావుపేట సమీపానికి చేరుకున్న సమయంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. యాత్రను చిత్రీకరిస్తున్న డ్రోన్ కెమెరా అనుకోకుండా చెట్టుపై ఉన్న తేనెటీగల తుట్టెను తాకడంతో, తేనెటీగలు ఒక్కసారిగా కార్యకర్తలపై దాడి చేశాయి. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. మంత్రి బండి సంజయ్ స్వల్పంగా అప్రమత్తమై, గాయపడిన వారికి వెంటనే వైద్య సేవలు అందేలా చూశారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం, "అంజన్న ఆశీస్సులు ఉన్నంత కాలం ఏ ఆటంకాలు మనల్ని ఆపలేవు" అంటూ తిరిగి యాత్రను కొనసాగించారు.

**మీడియాతో బండి సంజయ్ ముఖ్యాంశాలు:**

యాత్ర మార్గమధ్యంలో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ రాష్ట్ర రాజకీయాలపై నిప్పులు చెరిగారు:

**ప్రజాస్వామ్య ఖూనీ:** "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని, వారిపై అనర్హత వేటు వేయకుండా స్పీకర్ వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధం. దీనిపై మేము న్యాయపోరాటం చేస్తాం."

**అంజన్న మొక్కు:** "పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యకర్తల కష్టానికి ఫలితం దక్కింది. ఈ విజయం అంజన్న దయవల్లే సాధ్యమైంది. అందుకే ఈ కఠినమైన పాదయాత్ర చేపట్టి మొక్కు తీర్చుకుంటున్నాను."

సంక్షేమ పథకాలు: "కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో ఎక్కడా రాజీ పడం. కానీ రాష్ట్ర ప్రభుత్వం హక్కుల కోసం కాకుండా రాజకీయాల కోసమే కేంద్రంపై విమర్శలు చేస్తోంది."

**జగిత్యాలలో ఆధ్యాత్మిక వెల్లువ**

దాదాపు 8 గంటల పాటు సాగిన ఈ యాత్ర పొడవునా స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు, ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బీజేపీ శ్రేణులు ప్రత్యేక క్రమశిక్షణ పాటించాయి. సాయంత్రం వేళకు కొండగట్టు చేరుకున్న బండి సంజయ్, అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాత్రతో కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు రహదారి అంతా కాషాయ జెండాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# ఉద్యోగులకు ఏపీ సర్కార్ వరాలు

మొదటి పేజీ తరువాయి




మహిళా ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం కూడా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. 50 మందికి పైగా మహిళా సిబ్బంది ఉన్న కార్యాలయాల్లో తప్పనిసరిగా చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళల కోసం పింక్ టాయిలెట్లు, షీ క్యాబ్స్ సేవలను మరింత విస్తృతం చేయనున్నారు. దీనికి తోడు రూ.172 కోట్ల వ్యయంతో 23 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఒక్క విశాఖపట్నంలోనే మూడు హాస్టళ్లను నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి లక్ష పట్టణ జనాభాకు కనీసం ఒక వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఉండేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రెండో బిడ్డకు రూ.25 వేల ప్రోత్సాహం

అలాగే, సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ప్రభుత్వం అండగా నిలవనుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ వంటి సంతాన సాఫల్య చికిత్సలకు రాయితీ కల్పించనున్నారు. రెండో సంతానం నుంచి రూ.25 వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని కూడా అందించాలని నిర్ణయించారు. మరోవైపు రాష్ట్రంలో అధికంగా ఉన్న సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 67.5 శాతంగా ఉన్న సీ-సెక్షన్ల రేటును 40 శాతం కంటే తక్కువకు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

# యుద్ధం 'నిర్ణయాత్మక' దశకు..

## ఖార్గ్ దీవిపై అమెరికా-ఇజ్రాయెల్ భీకర దాడులు!

మొదటి పేజీ తరువాయి అయితే, మానవతా దృక్పథంతో చమురు మౌలిక సదుపాయాలకు (Oil Infrastructure) నష్టం కలిగించలేదని, కేవలం క్షిపణి నిల్వ కేంద్రాలు, డ్రోన్ లాంచర్లను మాత్రమే లక్ష్యం చేసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఇరాన్ అంతర్జాతీయ షిప్పింగ్‌ను అడ్డుకోవాలని చూస్తే, చమురు బావులను కూడా తగులబెడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.



**భారత దౌత్య విజయం: సురక్షితంగా బయటపడ్డ నౌకలు**

మరోవైపు, హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ప్రతిష్టంభన మధ్య భారత్ గొప్ప దౌత్య విజయాన్ని సాధించింది. ఇరాన్ ప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతి పొందిన రెండు భారతీయ చమురు నౌకలు --- 'శివాలిక్', 'నందాదేవి' --- శనివారం ఉదయం హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. సుమారు 92,700 టన్నుల ఎల్‌పీజీ గ్యాస్‌తో వస్తున్న ఈ నౌకలు మార్చి 16, 17 తేదీల్లో గుజరాత్ తీరానికి చేరుకోనున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ జరిపిన సంప్రదింపుల వల్ల మిగిలిన 22 నౌకలకు కూడా మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి.

**గల్ఫ్ దేశాలకు పాకిన సెగ**

యుద్ధం కేవలం ఇరాన్, ఇజ్రాయెల్‌లకే పరిమితం కాకుండా గల్ఫ్ దేశాలకు విస్తరిస్తోంది. శనివారం కతార్ రాజధాని దోహాలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించగా, యూఏఈ లోని ఫుజైరా చమురు కేంద్రం సమీపంలో క్షిపణి శకలాలు పడటంతో దట్టమైన పొగ కమ్ముకుంది. తమ గడ్డపై ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే సహించేది లేదని గల్ఫ్ దేశాలు హెచ్చరిస్తున్నాయి. ఇరాన్ మిత్రపక్షమైన హమాస్ కూడా, పొరుగు ముస్లిం దేశాలపై దాడులు చేయవద్దని ఇరాన్‌కు సూచించడం గమనార్హం.

**మొజ్తబా ఖమేనీపై 'రివార్డ్'.. అనిశ్చితిలో ఇరాన్**

ఇదే సమయంలో అమెరికా మరో కీలక అడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సహా ఇతర అగ్రశ్రేణి నాయకుల సమాచారం కోసం 10 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. ఇరాన్ రక్షణ వ్యవస్థలో 80 శాతం ఇప్పటికే ధ్వంసమైందని పాశ్చాత్య నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇరాన్ రక్షణ శాఖ మాత్రం తాము త్వరలోనే మరింత శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తామని హెచ్చరిస్తూ సరికొత్త రణతంత్రాన్ని సిద్ధం చేస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో భారీగా పడిపోతున్న కోడిగుడ్డు ధర..

మొదటి పేజీ తరువాయి



భారతదేశం నుండి గల్ఫ్ దేశాలకు గుడ్ల ఎగుమతులు ఆగిపోయాయి. ఫలితంగా ధరలు గణనీయంగా తగ్గాయి. జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ (చీజుజజ) అందించిన డేటా ప్రకారం, గత కొన్ని వారాలలో తెలుగు రాష్ట్రాలతో సహా చాలా రాష్ట్రాల్లో గుడ్ల ధరలు భారీగా తగ్గాయి. గతంలో గుడ్డు ధర రూ. 7.06 ఉండగా, కేవలం ఒక వారంలోనే రూ. 4.20కి తగ్గింది. అంటే దాదాపు సగానికి సగం తగ్గిపోయింది ధర.

పలు రాష్ట్రాల్లో ప్రతిరోజూ మిలియన్లకొద్ది గుడ్లు ఉత్పత్తి అవుతాయి. అత్యధికంగా హోస్పేటలో గుడ్లు ఉత్పత్తి అవుతాయి. అయితే గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్న గుడ్ల కంటైనర్ యుద్ధం కారణంగా వెనక్కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమిళనాడు, కర్ణాటకల నుంచి గల్ఫ్ దేశాలకు ప్రతి రోజు పెద్ద మొత్తంలో గుడ్లు ఎగుమతి అవుతాయి. దాదాపు 100 మిలియన్లకుపైగా గుడ్లు ఎగుమతి అవుతాయి. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ఆ ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది.

ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభం కావడంతో గుడ్ల వినియోగం కూడా తగ్గింది. తక్కువ వినియోగం, అధిక ఉత్పత్తి ధరల తగ్గుదలకు దారితీసింది. ధరలు తగ్గినప్పటికీ, గుడ్ల ఉత్పత్తి కొనసాగుతోంది. ఇది నిల్వలకు దారితీస్తుంది. ఉత్పత్తిదారులు అదనపు గుడ్లను కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేస్తున్నారు. అక్కడ వాటిని మూడు నెలల వరకు నిల్వ చేయవచ్చు.

ఏపీ, తెలంగాణలో ఇదే పరిస్థితి:

ఇక ఏపీ, తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి. రెండు నెలల క్రితం రూ.8 ఉన్న గుడ్డు ధర ఇప్పుడు సగానికి తగ్గింది. రాష్ట్రం ప్రతిరోజూ దాదాపు 35 మిలియన్ గుడ్లను ఉత్పత్తి చేస్తుంది. రాష్ట్ర వార్షిక గుడ్ల ఉత్పత్తి దాదాపు రూ.18,600 కోట్లు. ఇది భారతదేశంలో మూడవ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో గుడ్ల ధర సాధారణంగా ఏడాది పొడవునా రూ.5 నుండి 6 వరకు ఉంటుంది. కొన్నిసార్లు రూ.7 కంటే ఎక్కువగా ఉంటుంది. అయితే మార్కెట్ ధర ఇప్పుడు రూ.3.50 నుండి 3.80 వరకు తగ్గింది. ఫలితంగా గుడ్డుకు దాదాపు రూ.1.50 నష్టం వాటిల్లింది. అయితే హైదరాబాద్‌లో ప్రస్తుతం డజన్ గుడ్ల ధర రూ.50 వరకు ఉంది. ఇక ఏ పీలో కూడా ఇదే ధర కొనసాగుతోంది.

# మూసీ పేరుతో దోపిడీ చేస్తే అడ్డుకుంటాం

మొదటి పేజీ తరువాయి ప్రజలకు నష్టం లేకుండా కూడా మూసీని అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు.




లక్షల కోట్లు విలువ చేసే భూములపై కన్ను

మూసీ పేరుతో 3300 ఎకరాల భూములపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్నేశారని, ఈ భూముల విలువ సుమారు లక్షన్నర కోట్ల రూపాయలు ఉంటుందని కేటీఆర్ అన్నారు. ప్రజల ఇళ్లను కూల్చి వాటి పునాదులపై ప్రాజెక్టు నిర్మించడం అన్యాయమని మండిపడ్డారు. అభివృద్ధి చేస్తే సహకరిస్తామని, కానీ అవినీతి జరిగితే ఖచ్చితంగా అడ్డుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వంలో మూసీలోకి మురికినీరు చేరకుండా ఎస్టీపీలు నిర్మాణం, చెక్‌డ్యామ్‌లు, వాక్‌వేలు, సైక్లింగ్ ట్రాక్‌లు, పార్కులు వంటి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని మూసీలోకి తీసుకురావాలని కూడా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ఈ మొత్తం పనులకూ అప్పట్లో సుమారు 16 వేల కోట్ల రూపాయలే ఖర్చు అవుతుందని అంచనా వేశామని పేర్కొన్నారు.

నమామి గంగకు 42 వేల కోట్లు మాత్రమే..

నమామి గంగే ప్రాజెక్టుకు వందల కిలోమీటర్లకు 42 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చవుతుంటే, కేవలం 55 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. మూసీ పేరుతో ప్రజల సొమ్మును దోచుకోవాలని చూస్తే బీఆర్ఎస్ ఖచ్చితంగా అడ్డుకుంటుందని అన్నారు. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ ప్రజల హక్కులను కాపాడతామని, బాధితుల వెంట బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఒకటి రెండు సంవత్సరాలు బాధితులు కలిసికట్టుగా పోరాడితే భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక ప్రజల ఇళ్లు, భూములను కాపాడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విప్ వివేకానంద గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ మండలి చైర్మన్ స్వామి గౌడ్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొని మూసీ బాధితులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన బాధితులు తమ ఇళ్లను కూల్చివేయవద్దని ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన వ్యక్తం చేశారు.

# గ్యాస్ కొరతను కావాలనే సృష్టిస్తున్నారు : రామచందర్‌రావు



దేశంలో గ్యాస్ కొరత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కొంతమంది కావాలనే కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. "యుద్ధం వల్ల అనేక దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగాయి. మన దేశంలో మాత్రం పెరగలేదు. మోదీ ప్రభుత్వం ఈ ధరలను నియంత్రణలో పెట్టింది. గతంలో గ్యాస్ ధర రూ.1,200 ఉంటే.. మోదీ ప్రభుత్వం రూ.900లకు తగ్గించింది.

మూసీ పునరుజ్జీవానికి రూ.7వేల కోట్లు అంటున్నారు. మూసీ ప్రాజెక్టుకు భాజపా వ్యతిరేకం కాదు. అయితే, 50 మీటర్ల బఫర్ జోన్ అనేది అవసరం లేదు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు 100 ఎకరాలు కావాలా? గుజరాత్‌లో ఎవరికీ నష్టం లేకుండా సబర్మతి ప్రాజెక్టు పూర్తి చేశాం" అని రామచందర్‌రావు అన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 15-03-2026

# గౌడులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ వెంటనే అమలు చేయాలి

## కంఠమహేశ్వర దేవాలయ శంకుస్థాపనలో పాల్గొన్న జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ



ఇది కద నిజం :గౌడీకం నిర్వహించే గౌడ కులస్తులను వనం మైసమ్మ, కంఠ మహేశ్వరులు చల్లంగా చూడాలని, వారి వృత్తిలో ఆ దైవం నిరంతరం అండగా నిలిచి వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. గౌడ వృత్తిదారులు తాటి చెట్టు మీద నుంచి పడి మరణించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని, తక్షణమే వారికి రక్షిత యంత్రాలు అందివ్వాలని ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిచో వచ్చే ఎన్నికల్లో వారి ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని కేఎస్ఆర్ గౌడ హెచ్చరించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నాయకన్ గూడెం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ శ్రీ సురమాంబ కంఠమహేశ్వర దేవాలయ శంకుస్థాపనలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ శనివారం పాల్గొని పూజలు నిర్వహించారు.

తాను గెలిచిన వెంటనే గౌడుల డిమాండ్లను తీరుస్తానని చెప్పి రెండున్నర ఏళ్లవుతున్నా సీఎం రేవంత్ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆయన తెలిపారు. నాయకన్ గూడెం గ్రామ గౌడ నాయకులు మండవ నర్సయ్య, దొంతగాని నర్సయ్య, గ్రామ మాజీ సర్పంచ్ కాసాని సైదులు, మండవ వీర నాగులు, బుడిగ వెంకన్న, టీచర్ మండవ నర్సయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కాసాని నరేష్, గుండు వెంకట నారాయణ, బెల్లంకొండ నర్సింహా రావు, కాసాని నాగేశ్వరరావు, మండవ శ్రీరాం, మండవ సైదులు, మండవ అంజయ్య స్వామి, మండవ తిరుపతి, గునిగంటి నాగయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# నిత్యాన్నధానంకి విరాళం



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం):- ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నిత్యాన్నధానం పథకం అభివృద్ధికి నెల్లూరు వాస్తవ్యులు క్రీ"శే.బి.పెంచలరెడ్డి శ్రీమతి జయమ్మ గార్ల జ్ఞాపకార్థం కుమార్తెలు సుదర్శనమ్మ, పెంచలమ్మ నిత్యాన్నధానం పథకంకి యాభై వేలరూపాయలు నగదు రూపంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతికి అందజేశారు. అనంతరం వారికి కార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో శ్రీవార్ల దర్శనం స్వామివార్ల శేష వస్త్రములు మరియు ప్రసాదం అందజేశారు.

# దుర్గమ్మకు సూత్రాలు విరాళం



ఇంద్రకీలాద్రిపై వెలసిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ కు భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. చింతలపూడి, మండవల్లి మండలం ఏలూరు జిల్లా చెందిన మేడపాటి వెంకట నాగిరెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు శ్రీ అమ్మవారి అలంకరణ నిమిత్తం మరియు ఆలయ అభివృద్ధి నిమిత్తం భారీ విరాళాన్ని అందజేశారు.

దాతలు ఈరోజు ఆలయ అధికారులను కలిసి 32.500 గ్రాములు రూ.5,32,500/- (ఐదు లక్షల ముప్పై రెండు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే) విలువైన విరాళాన్ని సమర్పించారు.

ఆలయ అధికారులు దాతలకు స్వామి వారి శేషవస్త్రం మరియు ప్రసాదాలను అందజేసి, ప్రత్యేక ఆశీర్వచనం గావించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాదికారి వారి సమక్షములో చైర్మన్ గారు మరియు పాలక మండలి సభ్యులు చేతులు మీదుగా విరాళం అందజేసినారు.

# త్వరలో పైలెట్ ప్రాజెక్ట్



విజయనగరం (ఇది కద నిజం): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశములో విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలు పై ప్రస్థావించానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. అశోక్ బంగ్లాలో మీడియా తో అయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో హైవే రోడ్లు నిర్మాణానికి కేంద్ర మంత్రులు సానుకూలముగా స్పందించరన్నారు. అదే విధముగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టలు పై ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టలు పనులు పూర్తి చేసేందుకు సంబంధిత మంత్రులు, అధికారులు తో చర్చించమన్నారు. అదే విధముగా విజ్జి స్టేడియం లో పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు.

# తిరుపతిలో ఘనంగా మెట్లోత్సవం



తిరుపతి (ఇది కద నిజం) : జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ భగవంతుడిని చేరుకోవడమే మెట్లోత్సవం అంతరార్థమని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా. మేడసాని మోహన్ తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 523వ వర్ధంతిని పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వం నుంచి ఎందరో మహనీయులు మెట్ల మార్గంలో తిరుమలకు నడిచి వెళ్లి స్వామివారి కృపకు పాత్రులయ్యారని చెప్పారు. ఇటువంటి పవిత్రమైన మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలాన్ని ఇస్తుందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు వెయ్యికి పైగా భజన మండళ్ల సభ్యులు, ప్రముఖ సంగీత కళాకారులు భజనలు చేస్తూ సప్తగిరులను అధిరోహించి స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. మార్చి 15న ఆదివారం సాయంత్రం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెట్లోత్సవంలో సింగపూర్ కళాకారులు :

శ్రీ అన్నమాచార్యుల వారి వర్ధంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు సింగపూర్ నుండి 20 మంది కళాకారులు స్వచ్ఛందంగా విచ్చేశారు. సింగపూర్‌కు చెందిన డా. కె. భాగ్యమూర్తి ఆధ్వర్యంలో "అష్టలక్ష్మి విద్యార్థుల బృందం" శనివారం ఉదయం మెట్లోత్సవంలో పాల్గొంది.

ముందుగా అలిపిరి పాదాల మండపం వద్ద అన్నమాచార్య వంశీయులు మెట్లపూజ నిర్వహించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం చేశారు. ఇందులో "బ్రహ్మ కడిగిన పాదము", "భావములోన బాహ్యమునందును", "ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు", "పొడగంటిమయ్య నిన్ను పురుషోత్తమా", "కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు" వంటి కీర్తనలు ఆలపించారు. భక్తులు పరవశించి గోష్టిగానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు శ్రీమతి లత, అన్నమాచార్య వంశీయులు శ్రీ తాళ్లపాక హరినారాయణాచార్యులు, ఇతర అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

# సాగర తీరంలో వర్చువల్ డూమ్ త్రిల్ ఎక్స్పీరియన్స్...



## అబ్బురపడుతున్న సందర్శకులు ...
## వైజాగ్ ఎక్స్‌పో లో ప్రత్యేక ఆకర్షణ ...

విశాఖపట్నం(ఇది కద నిజం): నగరవాసులకు సరికొత్త కాన్సెప్ట్ తో ఫుల్ ఫన్ అండ్ ఎంటర్టైన్మెంట్ అందించడానికి విశాఖ సాగర తీరం వేదికవుతోంది. విశాఖ బీచ్‌రోడ్డులోని ఏయూ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్‌పో 2026 ఎగ్జిబిషన్ ప్రాంగణంలో 360 డిగ్రీల వర్చువల్ డూమ్ ప్రారంభమైంది. శుక్రవారం ప్రారంభమైన ఈ వర్చువల్ డూమ్‌లో 360 డిగ్రీలలో స్క్రీన్ ను వీక్షించడం కొత్త అనుభూతి నిస్తుంది. ప్రతీ సంవత్సరం నగరవాసులకు కొత్త కొత్త కాన్సెప్ట్ లతో వినోదాన్ని పంచే వైజాగ్ ఎక్స్‌పో నిర్వాహకులు ఈ సంవత్సరం వేసవిలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని పంచే విధంగా డోమ్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒకే సారి 40-50 మంది వరకు దీనికి వీక్షించే అవకాశం ఉంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. కదిలే చిత్రాలతో పాటు మనం కూడా కదులుతున్నామనే భావన కలిగించే విధంగా వర్చువల్ డూమ్ నిలుస్తోంది. ఒకవైపు యమలోకం, డైనో పార్క్, వివిధ రకాల ఎమ్యూజ్మెంట్ రైడ్స్, షాపింగ్ ,ఫుడ్ స్టాల్స్ తో పాటు ఎక్సక్లూజివ్ వర్చువల్ డూమ్‌ను బెస్ట్ టూరిస్ట్ ప్లేస్ గా పేరుగాంచిన విశాఖ కు పరిచయం చెయ్యడం బిగ్ డ్రీమ్ అని నిర్వాహకులు రాజారెడ్డి చెప్పుకొచ్చారు. విశాఖ వాసులు ఎల్లప్పుడూ కొత్తదనాన్ని స్వాగతించడంతో పాటు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అందుకే కోటి 50 లక్షల డూమ్ ప్రాజెక్ట్ ను రాష్ట్రంలో తొలిసారిగా 360 డిగ్రీలలో చిత్రాలను ప్రదర్శించే వర్చువల్ డూమ్‌ను విశాఖలో తీర్చిదిద్దామన్నారు.

# చందనోత్సవం, ఏర్పాట్లపై హోంమంత్రి సమీక్ష.



- సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం
- రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తం
- సామాజిక మాధ్యమాల్లో కొంతమంది తప్పుడు ప్రచారం
- ప్రజలు వదంతులను నమ్మవద్దు...హోం మంత్రి అనిత

అమరావతి, మర్చి 14(ఇది కద నిజం): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను మంత్రికి అందజేశారు. అనంతరం రాబోయే సింహాచలం చందనోత్సవం మరియు సింహాచలం కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఆలయ అధికారులు, అర్చకులతో మంత్రి అనిత సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, గత సంవత్సరం చందనోత్సవానికి సుమారు 1,20,000 మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారని తెలిపారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. చందనోత్సవం ఏర్పాట్లపై ఈ నెల చివర్లో మంత్రుల బృందం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు RTGS ద్వారా పరిస్థితులను సమీక్షిస్తున్నారని చెప్పారు.

RTGS రాష్ట్రానికి గుండె లాంటిదని మంత్రి పేర్కొన్నారు. అధికారులకు ముఖ్యమంత్రి తగిన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వదంతులను నమ్మవద్దని మంత్రి అనిత సూచించారు.

# ఏపీ రిజిస్ట్రార్ల సంఘం అధ్యక్షుడిగా గోపాల్.

## జనరల్ సెక్రటరీగా కృష్ణ ప్రసాద్.




విశాఖ పట్నం,మార్చి 24(ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ల అసోసియేషన్ ఎన్నిక విశాఖపట్నం లో జరిగింది. రిజిస్ట్రర్ల సంఘం అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా నల్లపాడు సబ్ రిజిస్టర్ గోపాల్, జనరల్ సెక్రటరీగా విజయవాడ సబ్ రిజిస్టర్ మేకాకృష్ణ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ గా విశాఖపట్నం డిఐజి ఆఫీసులో ఆడిట్ సబ్ రిజిస్టర్ గా పనిచేస్తున్న న్ నిరంజన్ కుమార్. కోశాధికారిగా సి. విజయ్ కుమార్ , స్పోర్ట్స్ మరియు కల్చరల్ సెక్రటరీగా టి వెంకట్రావు. జాయింట్ సెక్రెటరీగా గోపీచంద్. అసోసియేట్ ప్రెసిడెంట్లు గా కె వెంకటేశ్వరరావు. ఎం షమీర్ భాష. కే విజయ్ కుమార్, బి లక్ష్మీదేవి, ధరణి , ఆర్గనైజింగ్ సెక్రటరీలు గా, వీవీవీ ప్రసాద్, ఎంవి సుబ్బారావు, బి గీతాలక్ష్మి, ఎన్నికైనట్లు సబ్ రిజిస్ట్రార్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని కార్యవర్గం ప్రతిజ్ఞ చేశారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు కోడలును ఆశీర్వదించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు విచ్చేసి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షి దంపతులను ఆశీర్వదించారు.

ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క - నందిని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.

గత మార్చి 5వ తేదీన సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భట్టి విక్రమార్క స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి చంద్రబాబును వివాహానికి ఆహ్వానించారు. అయితే, అప్పట్లో ఉన్న అత్యవసర కార్యకలాపాలు, బిజీ షెడ్యూల్ కారణంగా చంద్రబాబు వివాహానికి హాజరుకాలేకపోయారు. ఈ క్రమంలోనే నేడు ప్రత్యేకంగా ప్రజాభవన్‌కు విచ్చేసి నూతన దంపతులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిల్లా శ్రీధర్ బాబ, వాకిటి శ్రీహరి లు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్



## నేను నిర్మించిన సినిమాలన్నీ నష్టాలే: విజయ్ సేతుపతి



నటుడు విజయ్ సేతుపతి తాను నిర్మాతగా చేసిన సినిమాలన్నీ నష్టాలను తెచ్చాయని తెలిపారు. ఆయన ప్రారంభించిన సంగత్ దేవన్ సినిమా మధ్యలోనే ఆగిపోవడంతో భారీ నష్టం ఎదురైంది. తర్వాత నిర్మించిన ఆరంజ్ మిట్టాయి , మెర్కు తొడర్చి మలై , జుంగా , లాభం సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా ఆర్థికంగా లాభాలు రాలేదని చెప్పారు. అయినా తనకు నచ్చిన కథలతో సినిమాలు చేశానన్న సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన నిర్మించిన కాట్టాన్ వెబ్ సిరీస్ హాట్స్టార్ లో విడుదలకు సిద్ధమవుతోంది.

## బ్లాక్ బస్టర్ డైరెక్టర్‌తో నాని..



న్యాచురల్ స్టార్ నాని వరుస విజయాలతో దూసుకుపోతూ పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న ది ప్యారడైజ్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.


ఈ సినిమా తర్వాత సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' అనే యాక్షన్ డ్రామాలో నాని నటించనున్నారు.ఇదిలా ఉండగా, మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు కూడా నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. 'సార్', 'లక్కీ భాస్కర్' సినిమాలతో మంచి ఫామ్‌లో ఉన్న వెంకీ అట్లూరి, నాని కోసం ప్రత్యేక కథ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.ఈ ప్రాజెక్ట్‌ను సూర్యదేవర నాగ వంశి తన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం వెంకీ అట్లూరి సూర్య తో 'విశ్వనాథన్ అండ్ సన్స్' చిత్రంలో బిజీగా ఉండగా, ఆ తర్వాత నాని సినిమాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## 'సర్కార్ 4' ప్రకటించిన రామ్ గోపాల్ వర్మ



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన ప్రసిద్ధ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా సర్కార్ 4 ను అధికారికంగా ప్రకటించారు. ముంబైలో జరిగిన రెడ్ లారీ ఫిలిం ఫెస్టివల్ లో ఈ విషయాన్ని వెల్లడించారు.

2005లో వచ్చిన సర్కార్ , తర్వాత సర్కార్ రాజ్ , సర్కార్ 3 విజయాల తర్వాత ఇప్పుడు నాలుగో భాగం వస్తోంది. ఇందులో అమితాబ్ బచ్చన్ మళ్లీ సుభాష్ నాగ్రేగా కనిపించనున్నారు.ఈ చిత్ర షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభం కానుందని వర్మ తెలిపారు.



## వచ్చే వారం నుంచే అసలైన ఆట!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న రగ్గడ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. చరణ్‌కు సంబంధించిన టాకీ పార్ట్ దాదాపు పూర్తయ్యింది. ప్రస్తుతం ఆయన లేని కొన్ని ప్యాచ్ వర్క్ సీన్లను సెకండ్ యూనిట్ చిత్రీకరిస్తుండగా, మరో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు స్పెషల్ సాంగ్ షూట్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం.

దర్శకుడు బుచ్చి బాబు సాన సినిమా విడుదలను అనుకున్న సమయానికి చేయాలని షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రమోషన్స్ ప్రారంభానికి కూడా చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది. మార్చి 27న రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా 'పెద్ది' టీజర్ విడుదల చేసే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందగా, టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచనుంది.ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.



## 'సిగ్మా' విడుదలపై సందిగ్ధత



సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న 'సిగ్మా' సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందని సమాచారం. ఈ చిత్రంతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

విజయ్ రాజకీయాల్లో బిజీగా ఉండటం, అలాగే టీవీకే కార్యకలాపాల నేపథ్యంలో సినిమా విడుదలను వాయిదా వేయాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు. ఎన్నికల తర్వాతే సినిమాను విడుదల చేసే అవకాశముందని వార్తలు వినిపిస్తున్నాయి.

## బాలీవుడ్‌లో కీర్తి సురేష్ మరో భారీ ప్రాజెక్ట్..

### రాజ్ కుమార్ రావుతో కలిసి సరికొత్త థ్రిల్లర్!

నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ బాలీవుడ్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు తో కలిసి ఆమె 'రఫ్తార్' అనే ఇంటెన్స్ థ్రిల్లర్‌లో నటించనున్నారు.

ఈ చిత్రాన్ని పాత్రలేఖ తన నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై, అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించనున్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలు, కార్పొరేట్ పోటీ, డబ్బు-అధికారాల ప్రభావం వంటి అంశాల నేపథ్యంలో కథ సాగనుంది.

'సెక్టార్ 36' దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అనురాగ్ ఠాకూర్ , తాన్యా మణిక్తల , రజత్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.